

పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510


Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 325 | పేజీలు - 08 | వెల - 05/- | ఆదివారం 22-11-2026



కూటమికి

ప్రజల తిరుగులేని మద్దతు



- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అండగా నిలిచారన్న సీఎం చంద్రబాబు
- జిల్లా పరిషత్ ఎన్నికల్లో 96.42 శాతం స్ట్రయిక్ రేట్ సాధించినట్లు వెల్లడి
- సామాన్య కార్యకర్తలు మరియు మహిళలకు పదవుల్లో అధిక ప్రాధాన్యం
- వైసీపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టారన్న ముఖ్యమంత్రి
- ప్రజాప్రతినిధుల పనితీరు ఆధారంగా తగిన చర్యలు ఉంటాయని స్పష్టీకరణ

స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ పన్నిన కుట్రలు, కుతంత్రాలను ప్రజాస్వామ్యబద్ధంగా తిప్పికొట్టిన రాష్ట్ర ఓటర్లకు హ్యాట్సాఫ్ చెబుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి రుజువు చేసిందని స్పష్టం చేశారు. ఎన్నికలు జరగకుండా ఆపేందుకు కోర్టుల్లో 63 పిటిషన్లు వేసి, బీసీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్ పేరిట అడ్డంకులు సృష్టించారని, హింసకు పాల్పడుతూ ఎదురు ఫిర్యాదులు చేసిన వైసీపీ డ్రామాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని సీఎం మండిపడ్డారు.

ముగ్గురు టీడీపీ నేతలు అలిగారు.. అలా అలగడం నాకు నచ్చలేదు!

రాజకీయాల్లో డబ్బిస్తే ఓటేస్తారనే భావన పోయిందని, ఇటీవల ఒక ఓటరు అభ్యర్థి ఇచ్చిన డబ్బును ఏకంగా బ్యాలెట్ బాక్సులోనే వేసి తిరస్కరించడం ప్రజల చైతన్యానికి నిదర్శనమని చంద్రబాబు కొనియాడారు. ఇదే సమయంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల పనితీరుపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరు ఎమ్మెల్యేల పనితీరు పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉందని, అలాంటి వారు వెంటనే తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. టికెట్ల సర్దుబాటు సమయంలో టీడీపీలోని ముగ్గురు నేతలు అలిగారని, ఇంత శ్రమించి పనిచేస్తుంటే అలా అలగడం తనకు ఏమాత్రం నచ్చలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా లాంటి ప్రాంతాల్లో ఆశించిన ఫలితాలు రాలేదని, అక్కడ జరుగుతున్న బలవంతపు మతమార్పిడులు, ఇతర అంశాలపై క్షేత్రస్థాయి సమీక్ష జరుపుతామన్నారు. వచ్చే పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఎదుగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారని సీఎం గుర్తుచేశారు. ప్రజలు ఇచ్చిన ఈ ఘనమైన

మిగతా 2లో

ఐఐటీ ఖరగ్‌పూర్ దేశ

ప్రగతికి కీలకం

- ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో మాట్లాడిన నరేంద్ర మోదీ
- సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోవాలని హితవు
- దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని వ్యాఖ్య
- కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ముందుకు సాగిందని స్పష్టీకరణ
- 50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని వెల్లడి



సవాళ్లను ఎదుర్కోకుండా తాను జీవించలేనని, సంకుచిత భావజాలాన్ని వీడినప్పుడే వ్యక్తులతో పాటు దేశం పురోగమిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోకపోతే అనుకున్న ప్రగతిని ఎప్పటికీ సాధించలేమని యువతకు సూచించారు. దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని, గత కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ఎంతో ముందుకు సాగిందని స్పష్టం చేశారు.ఒకప్పుడు దేశంలో పేదరికాన్ని మార్చలేని శాపంగా భావించే వారని, భారత్ దాని నుంచి ఎప్పటికీ బయటపడలేదన్న అభిప్రాయం ఉండేదని ప్రధాని గుర్తుచేశారు.

మిగతాది 2లో


ఆపరేషన్ సిందూర్ వేళ పాక్‌కు

చైనా సాయం!

భారత సరిహద్దు మోహరింపుల సమాచారాన్ని పాక్‌కు చేరవేసిన చైనా

- భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకే పాక్‌కు చైనా సాయం చేసిందన్న యూఎస్ ప్యానెల్
- ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ యుద్ధ విమానాలకు చైనా సాంకేతిక మద్దతు
- రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు పొంచి ఉందని కమిషన్ హెచ్చరిక
- భారత్‌తో నిఘా, రక్షణ భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని అమెరికా ప్రభుత్వానికి సిఫార్సు

భారత్ ఎదుగుదలను అణచివేసే కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు చైనా సైనిక సాయం అందించిందని అమెరికా కాంగ్రెస్ కమిషన్ తన తాజా నివేదికలో కుండబద్దలు కొట్టింది. సరిహద్దుల్లో



2

కర్బన ఉద్గారాల తగ్గింపే లక్ష్యం

- పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి రూ.20 వేల కోట్ల ప్రణాళిక
- వాతావరణ మార్పులను తట్టుకునేలా పట్టణాల అభివృద్ధి
- వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీ, వర్షపు నీటి పారుదల వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి
- వ్యర్థాల నుంచి విద్యుత్.. మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం



హైదరాబాద్: రాష్ట్రంలో పట్టణ మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేసేందుకు పురపాలక శాఖ రూపొందించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. వాతావరణ మార్పులను తట్టుకునేలా, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే విధంగా పట్టణాలను అభివృద్ధి చేయడానికి చేపట్టాల్సిన ప్రణాళికలపై సమావేశంలో చర్చించారు. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ), జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకుతో పాటు దేశీయ ఆర్థిక సంస్థల సహకారంతో దాదాపు రూ.20 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టేందుకు పురపాలక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు వరంగల్ నగర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ,

మిగతాది 2లో

సిరాజ్ ఎంపికపై రాజకీయ

దుమారం?

- న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో సిరాజ్‌కు దక్కని చోటు
- నిర్ణయంపై స్పందించిన మహ్మద్ అజహరుద్దీన్
- సిరాజ్‌కు తుది జట్టులో మెరుగైన ప్రాధాన్యం దక్కాల్సిందన్న వ్యాఖ్య
- నిర్ణయంపై మేనేజ్‌మెంట్ సరైన వివరణ ఇవ్వాలని స్పష్టీకరణ
- ఎంపిక వ్యవహారంపై రాజుకున్న రాజకీయ, మతపరమైన వివాదం



2

న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను భారత తుది జట్టు నుంచి తప్పించడంపై భారత మాజీ కెప్టెన్, తెలంగాణ

సీఎం రేవంత్‌కు

నేరుగా సవాల్!

- హుజూరాబాద్‌లో కొత్త పింఛన్లు ఇవ్వలేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శ
- ఒక్క కొత్త పింఛను మంజూరు చేసినట్లు తేలితే రాజీనామా చేస్తానని సవాల్
- నియోజకవర్గంలో 1,029 పింఛన్లను రద్దు చేశారని ఆరోపణ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం

కేంద్రస్థానం కావాలి

భోగాపురంపై కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రత్యేక దృష్టి
కేంద్రీకరించిందని వెల్లడి



- కుప్పం, పలాస ఎయిర్‌పోర్టులకు భూసేకరణ జరుగుతోందన్న రామ్మోహన్ నాయుడు
- సీఐఐ సమ్మిట్‌తో ఏపీ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేశామన్న కేంద్ర మంత్రి

2

కొత్తగా వచ్చే విమానయాన సంస్థలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాన స్థావరంగా (బేస్) మారాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. దేశవ్యాప్తంగా విమానయాన రంగాన్ని విస్తరించే క్రమంలో మరిన్ని కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రం వద్ద పరిశీలనలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌పోర్టుల నెట్‌వర్క్ విస్తరణపై మాట్లాడిన కేంద్రమంత్రి...

కాంగ్రెస్‌కు కేంద్ర

మంత్రి రిజిజు 4 సూటి ప్రశ్నలు

- కాంగ్రెస్ పార్టీని నాలుగు ప్రశ్నలు అడిగిన కేంద్ర మంత్రి రిజిజు
- 1962 చైనా యుద్ధ అవమానానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- భారత్‌ను ఎందుకు పేద దేశంగా ఉంచారో చెప్పాలన్న మంత్రి
- దేశ ఆర్థిక వ్యవస్థను అవమానించారంటూ కాంగ్రెస్‌కు ప్రశ్నలు
- ఏపెక్ త్రైపాక్షిక భేటీపై ప్రధాని మోదీని విమర్శించిన రాహుల్

కాంగ్రెస్ పార్టీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లక్ష్యంగా శనివారం ఆయన నాలుగు సూటి ప్రశ్నలను సంధించారు. చైనాలో జరిగిన ఏపెక్ సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీపై ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై రిజిజు మండిపడ్డారు.ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించిన రిజిజు.



2



2

స్థానిక ఎన్నికలపై జగన్ తీవ్ర ఆగ్రహం

- ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్రస్థాయిలో మండిపడ్డ జగన్
- నామినేషన్లు చించేసి గెలిచినవారిని ఓడించారంటూ వైసీపీ అధినేత ఆరోపణలు
- ఎంపీ అవినాశ్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై హత్యాయత్నాలు జరిగాయని ఆవేదన

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై వైసీపీ అధినేతజగన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం

ఐఐటీ ఖరగ్‌పూర్ దేశ ప్రగతికి కీలకం: మోదీ



ఉండేదని ప్రధాని గుర్తుచేశారు. గతంలో ఎవరూ ఆ సమస్యను పరిష్కరించే సాహసం చేయలేదన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక నిరుపేదల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు. ఫలితంగా దేశంలో దాదాపు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక స్వయంగా ధ్రువీకరించిందని తెలిపారు. గత 75 ఏళ్ల కాలంలో భారత్ ఎడ్లబండ్ల స్థాయి నుంచి బుల్లెట్ రైళ్ల దిశగా వేగంగా ఎదిగిందని, ఈ చారిత్రక మార్పులకు ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచిందని పేర్కొన్నారు.అంతరిక్ష పరిశోధన రంగంలోనూ సరికొత్త మార్పులు తెచ్చామని మోదీ వివరించారు. గతంలో ఇస్రోలోకి ప్రతిభావంతులైన యువత ప్రవేశంపై అనేక ఆంక్షలు ఉండేవని, వాటిని తొలగించి అర్హులైన యువ నిపుణులకు తలుపులు తెరిచామని వెల్లడించారు. అందుకే నేడు భారత అంతరిక్ష విజయాలను ప్రపంచం మొత్తం గుర్తిస్తోందన్నారు. సెమీకండక్టర్ల రంగంలో ఐదు దశాబ్దాల క్రితం అవకాశాన్ని చేజార్చుకున్నప్పటికీ, తాము పట్టుదలతో నాలుగేళ్లలోనే భారీ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించనుందని, విద్యార్థులు 'దేశమే ప్రథమం' అనే నినాదంతో సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

కర్బన ఉద్గారాల తగ్గింపే లక్ష్యం

కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకుతో పాటు దేశీయ ఆర్థిక సంస్థల సహకారంతో దాదాపు రూ.20 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టేందుకు పురపాలక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

వరంగల్ నగర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, వరంగల్ కోట చుట్టూ ఉన్న కందకం పునరుద్ధరణ, హనుమకొండలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు.

రాష్ట్రంలో మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు, ముఖ్యంగా టెక్స్‌టైల్ పార్కులకు వినియోగించడం ద్వారా మంచినీటి వనరులపై ఒత్తిడిని తగ్గించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగం తగ్గించాలి

పట్టణాల్లో తాగునీటి సరఫరా, నీటి శుద్ధి, పంపింగ్ వ్యవస్థల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. పునరుత్పాదక ఇంధన వనరులను విస్తృతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వరంగల్ మెగా సిటీ ఎకనామిక్ రీజియన్ పరిధిలో వ్యర్థాల నుంచి 10 నుంచి 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను సీఎం సమీక్షించారు. అలాగే బయో సీఎన్‌జీ ఉత్పత్తి, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుపైనా చర్చించారు.

కర్బన ఉద్గారాల తగ్గింపే లక్ష్యం

ప్రతిపాదిత ప్రాజెక్టుల ద్వారా పట్టణాల్లో కర్బన ఉద్గారాలను తగ్గించడం, నీటి వనరులను సంరక్షించడం, వరద ముప్పును నివారించడం, పురపాలక సంస్థల నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది.

ఆపరేషన్ సిందూర్ వేళ పాక్‌కు చైనా సాయం

అమెరికా కాంగ్రెస్ కమిషన్ తన తాజా నివేదికలో కుండబద్దలు కొట్టింది. సరిహద్దుల్లో సైనిక ఒత్తిడి పెంచడం, పారిశ్రామిక సరఫరాలపై ఆంక్షలు విధించడం ద్వారా భారత్‌ను కట్టడి చేసేందుకు బీజింగ్ ప్రయత్నిస్తోందని అమెరికా–చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ వెల్లడించింది. ఆసియాలో చైనాకు ప్రత్యామ్నాయ శక్తిగా భారత్ ఎదుగుతోందని, దీనిని అడ్డుకునేందుకే చైనా బహుముఖ వ్యూహాలను రచిస్తోందని పేర్కొంది.

గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్–పాక్ మధ్య జరిగిన నాలుగు రోజుల ఘర్షణల్లో చైనా నేరుగా యుద్ధంలోకి దిగకుండానే పాకిస్థాన్‌ను బలోపేతం చేసిందని నివేదిక స్పష్టం చేసింది. పాక్ వాయుసేన ఉపయోగించిన జే–10సీఈ యుద్ధ విమానాల పూర్తి స్థాయి వినియోగానికి తమ ఇంజనీర్లు అక్కడే ఉండి సాంకేతిక సహకారం అందించారని చైనా స్వయంగా అంగీకరించిన విషయాన్ని కమిషన్ ప్రస్తావించింది. భారత్ మోహరింపులకు సంబంధించిన సమాచారాన్ని కూడా చైనా ఎప్పటికప్పుడు పాక్‌కు చేరవేసిందని తెలిపింది. భవిష్యత్‌లో రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు (టూ–ఫ్రంట్ వార్) ఎదురయ్యే ప్రమాదం దీనివల్ల భారత్‌కు మరింత పెరుగుతోందని హెచ్చరించింది. మరోవైపు భారత్‌పై చైనా ఆర్థిక అస్త్రాన్ని కూడా ప్రయోగిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని దెబ్బతీసేందుకు ముడిసరకుల ఎగుమతులను ఆపడం, తమ ఇంజనీర్లను వెనక్కి పిలిపించడం వంటి చర్యలకు దిగుతోందని తెలిపింది. భారత ఫార్మా, క్లీన్ ఎనర్జీ రంగాలు పుంజుకోకుండా చైనా తక్కువ ధరల వ్యూహాలను, బ్యాటరీ టెక్నాలజీ ఆంక్షలను అమలు చేస్తోందని విశ్లేషించింది. ఈ వ్యూహాలను దీటుగా ఎదుర్కొనేందుకు భారత్ తన రక్షణ రంగాన్ని ఆధునికీకరిస్తూనే దేశీయ తయారీకి పెద్దపీట వేస్తోందని, అమెరికా కూడా భారత్‌తో నిఘా, సముద్ర భద్రత, తయారీ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని ఈ కమిషన్ పిలుపునిచ్చింది.

స్థానిక ఎన్నికలపై జగన్ తీవ్ర ఆగ్రహం

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై వైసీపీ అధినేతజగన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలతో పాటు ప్రస్తుతం పార్టీ రహితంగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికలను కూడా అధికార కూటమి రిగ్గింగ్ చేస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్య సూత్రాలే అమలు కావడం లేదని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని ఆయన సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. హే రామ్.. ఆంధ్రప్రదేశ్ ను కాపాడు అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'ఫ్రీ అండ్ ఫెయిర్' ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితులు పూర్తిగా కనుమరుగయ్యాయని జగన్ ఆరోపించారు. విపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడమే కాకుండా, దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను అధికారులే నేరుగా చించివేశారని ఆయన ఆరోపించారు. పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి ఓట్లను అపహరిస్తున్నారని, చివరకు ఎన్నికల్లో గెలిచిన వారిని కూడా ఓడినట్లుగా ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), పోలీసులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ఫలితాలను ప్రభావితం చేస్తున్నారని, ఎన్నికల సంఘం కూడా అధికార పార్టీ చర్యలను అడ్డుకోవడంలో విఫలమైందని జగన్ విమర్శించారు. గత ఐదేళ్ల తమ పాలనలో రాష్ట్రం ఎంతో సుస్థిరంగా, ప్రశాంతంగా సాగిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటూ వ్యవస్థలు పూర్తిగా భ్రష్టుపట్టాయని జగన్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై జరిగిన హత్యాయత్నాల ఘటనలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో దాడికి దిగారని, పోలీసుల ముందే వాహనాలకు నిప్పంటించి చంపే ప్రయత్నం చేశారని జగన్ ఆరోపించారు. ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారికి ప్రభుత్వం కొమ్ముకాస్తూ, బాధితులపైనే అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన పలు వీడియోలను వైఎస్ జగన్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొంటూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ జగన్ తన పోస్ట్‌లో పిలుపునిచ్చారు.

కూటమికి ప్రజల తిరుగులేని మద్దతు

టికెట్ల సర్దుబాటు సమయంలో టీడీపీలోని ముగ్గురు నేతలు అలిగారని, ఇంత శ్రమించి పనిచేస్తుంటే అలా అలగడం తనకు ఏమాత్రం నచ్చలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా లాంటి ప్రాంతాల్లో ఆశించిన ఫలితాలు రాలేదని, అక్కడ జరుగుతున్న బలవంతపు మతమార్పిడులు, ఇతర అంశాలపై క్షేత్రస్థాయి సమీక్ష జరుపుతామన్నారు.

వచ్చే పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఎదుగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారని సీఎం గుర్తుచేశారు. ప్రజలు ఇచ్చిన ఈ ఘనమైన తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా మరింత అంకితభావంతో ముందుకు సాగుతామని చంద్రబాబు స్పష్టం చేశారు.

కూటమికి తిరుగులేని ప్రజాదరణ – ట్రిపుల్ ఇంజిన్ సర్కార్

ఈవీఎం అయినా, బ్యాలెట్ పేపర్ అయినా, పోస్టల్ బ్యాలెట్ అయినా ప్రజల తీర్పు కూటమికే అనుకూలంగా ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక పోరులో కూటమి అపూర్వ విజయం సాధించిందని గణాంకాలతో వివరించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో 96.42 శాతం స్ట్రయిక్ రేట్, మండల పరిషత్‌లలో 93.15 శాతం, మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రయిక్ రేట్‌ను కూటమి దక్కించుకుందని వెల్లడించారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో 39.81 శాతంగా ఉన్న వైసీపీ ఓటు బ్యాంకు, ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో 33.56 శాతానికి పడిపోయిందని, ఏకంగా 6.25 శాతం ఓట్లు ఆ పార్టీకి తగ్గాయని తెలిపారు. కూటమికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదరణ మరింత పెరిగిందని, ఈ ఘనవిజయంతో రాష్ట్రంలో 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' ఏర్పాటైందని సీఎం పేర్కొన్నారు.

సామాన్య కార్యకర్తలు, విద్యావంతులకే జెడ్పీ పీఠాలు

రాజకీయాల్లో కుటుంబ పాలన, ధన ప్రభావానికి తావులేకుండా పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన సామాన్య కార్యకర్తలను, విద్యావంతులను ఉన్నత పదవుల్లో కూర్చోబెట్టామని సీఎం వివరించారు. జనాభా దామాషా పద్ధతిన అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో సమన్యాయం కల్పించామన్నారు. కర్నూలు జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్‌గా 25 ఏళ్లకే ఎంబీబీఎస్ పూర్తి చేసిన షేక్ షాదికను, గంపలగూడెం జెడ్పీటీసీగా ఎంటెక్ చదివిన ఎస్సీ యువతి కోట పుల్లమ్మను గెలిపించుకున్నామని చెప్పారు. మొత్తం 22 జెడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 12 మహిళలకే ఇచ్చామని, వీరిలో 14 మంది ఉన్నత విద్యావంతులు ఉన్నారని తెలిపారు. అలాగే 20 జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 11 మహిళలకు కేటాయించగా అందులో 17 మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లేనని వివరించారు.

పల్నాడు జెడ్పీ ఛైర్‌పర్సన్‌గా యాదవ వర్గానికి చెందిన సామాన్య కార్యకర్త పుచ్చకాయల రమాదేవి, తూర్పుగోదావరిలో శెట్టిబలిజ వర్గానికి చెందిన కాడ పద్మ, కడప జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్‌గా ముస్లిం మహిళ హబీబున్నీసా, ప్రకాశం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పార్టీ యూనిట్ ఇన్‌ఛార్జి కొక్కిలిగడ్డ ప్రభాకర్ రావు, నంద్యాల జెడ్పీ ఛైర్మన్‌గా క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ బురహానుద్దీన్, పశ్చిమ గోదావరి వైస్ ఛైర్మన్‌గా బూత్ కన్వీనర్ నాగేశ్వరరావు, అన్నమయ్య జిల్లాలో బోయ సామాజిక వర్గానికి చెందిన తలారి శరణ్యలకు అవకాశం ఇచ్చి 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతాన్ని ఆచరణలో చూపించామని చంద్రబాబు పేర్కొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రజల ఆమోదం

గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి, రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని సీఎం తెలిపారు. తీవ్ర ఎల్‌నినో ప్రభావం, వరుసగా రెండు తుఫాన్లు రాష్ట్రాన్ని తాకిన సమయంలో తమ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించి ఆదుకుందన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ సంస్థలను రూ.1.30 లక్షల కోట్ల అప్పుల్లో ముంచి, ప్రజలపై రూ.32 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం మోపిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్ల కాలంలో కరెంటు ఛార్జీలు పైసా కూడా పెంచలేదని స్పష్టం చేశారు. పోలవరం ద్వారా గోదావరి జలాలను విశాఖపట్నం, కృష్ణా డెల్టాకు తరలించే దిశగా పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.

కాంగ్రెస్‌కు కేంద్ర మంత్రి రిజిజు 4 సూటి ప్రశ్నలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించిన రిజిజు.. 1962 భారత్–చైనా యుద్ధంలో తమ గ్రామాన్ని చైనా ఆక్రమించిందని గుర్తుచేశారు. ఆ చారిత్రక అవమానానికి కాంగ్రెస్ ఎప్పుడు క్షమాపణ చెబుతుందని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో భారత్‌ను ఎందుకు పేద దేశంగా ఉంచారో సమాధానం చెప్పాలన్నారు. మన దేశాన్ని 'పాములు ఆడించేవారి దేశం'గా ఎందుకు ప్రచారం చేశారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత ఆర్థిక వ్యవస్థను 'హిందూ రేట్ ఆఫ్ గ్రోత్' అంటూ ఎందుకు అవమానించారో కాంగ్రెస్ చెప్పాలని ప్రశ్నించారు. అంతకుముందు రాహుల్ గాంధీ స్పందిస్తూ, కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే ఆ అగ్రరాజ్యాల అధినేతల టేబుల్ వద్ద భారత ప్రధాని కూర్చుని ఉండేవారని వ్యాఖ్యానించారు. రాజీపడిన ప్రధాని ఎప్పటికీ అక్కడ కూర్చోలేరంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన రిజిజు, రాహుల్ దేశంలో ఉన్నా, విదేశాలకు వెళ్లినా భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. విదేశీ భారత వ్యతిరేక శక్తులతో ఆయన చేతులు కలిపారని, భారత ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

విస్తరణపై మాట్లాడిన కేంద్రమంత్రి... కుప్పం, పలాస ప్రాంతాల్లో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సుల గురించి ప్రస్తావిస్తూ... వైజాగ్‌కు సీఐఐ సమ్మిట్‌లు కొత్తేమీ కాదని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇప్పుడే కాకుండా, గతంలోనూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఐఐ సమ్మిట్‌తో పాటు అనేక అంతర్జాతీయ సదస్సులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఆ సదస్సుల ద్వారానే ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించగలిగామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సు దేశంలోనే ఇంతకుముందెన్నడూ జరగని రీతిలో అత్యంత ఘనంగా జరిగిందని, ఇది రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎంతగానో దోహదపడుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.ం

కొత్త పింఛన్లపై సీఎం రేవంత్‌కు కౌశిక్ రెడ్డి

రాజీనామా సవాల్

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త పింఛను కూడా మంజూరు చేయలేదని, పైగా అర్హులైన పేదల పింఛన్లను తొలగించిందని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో పింఛన్ల అంశంపై సీఎంకు ఆయన నేరుగా రాజీనామా సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... "ఒక్క కొత్త పింఛను ఇచ్చినా నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. లేకుంటే సీఎం పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా" అంటూ ఆయన సవాల్ చేశారు. తన నియోజకవర్గంలో లబ్ధిదారుల సంఖ్య పెరిగినట్లు అధికార పక్షం నిరూపిస్తే తాను క్షమాపణ చెప్పి పదవి నుంచి తప్పుకుంటానని, అలా నిరూపించలేకపోతే సీఎం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం హుజురాబాద్‌లో దాదాపు 1,029 చేయూత పింఛన్లను రద్దు చేసిందని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. గతంలో వృద్ధులకు ఉన్న రూ. 200 పింఛన్‌ను కేసీఆర్ రూ. 2 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచి పేదలకు అండగా నిలిచారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో ప్రతి నెలా 45 లక్షల మందికి పింఛన్లు అందేవని పేర్కొన్నారు.

సిరాజ్ ఎంపికపై రాజకీయ దుమారం

(మొదటి పేజీ తరువాయి)

తుది జట్టు నుంచి తప్పించడంపై భారత మాజీ కెప్టెన్, తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశానికి ఎన్నో విజయాలు అందించిన సిరాజ్ పట్ల జట్టు యాజమాన్యం మరింత మెరుగైన ప్రాధాన్యం ఇచ్చి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై అజహరుద్దీన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. గతంలో ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా జట్టుకు దూరం అయిన కీలక సందర్భాల్లో సిరాజ్ ముందుండి పేస్ విభాగాన్ని నడిపించిన తీరును, అతడి అంకితభావం, ప్రతిభ, మైదానంలో చూపించే పోరాట పటిమను ఆయన గుర్తుచేశారు. ఇదే సమయంలో జట్టులోకి ఎంపికైన యువ పేసర్ అన్షుల్ కాంబోజ్‌కు శుభాకాంక్షలు తెలిపిన అజహరుద్దీన్, సిరాజ్‌ను తుది జట్టు నుంచి ఎందుకు తప్పించాల్సి వచ్చిందో టీమ్ మేనేజ్‌మెంట్ అతడికి పూర్తి స్పష్టతతో, తగిన గౌరవంతో వివరించి ఉంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత జట్టుకు సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా సేవలు అందించిన అనుభవంతో పాటు తెలంగాణ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అజహరుద్దీన్ చేసిన ఈ వ్యాఖ్యలు క్రీడా, రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మరోవైపు, సిరాజ్ ఎంపిక వ్యవహారం రాజకీయ, మతపరమైన మలుపు తీసుకుంది. ఆటగాళ్ల ఎంపిక ప్రక్రియలో మతపరమైన అంశాలు ప్రభావం చూపాయా అని కాంగ్రెస్ ఎంపీ ఒకరు ఆరోపించారు. సిరాజ్ ముస్లిం అయినందువల్లే అతడిని పక్కన పెట్టారా అంటూ ఆయన ప్రశ్నించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం జరుగుతున్న తొలి టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు పటిష్ఠ స్థితిలో కొనసాగుతున్నప్పటికీ, సిరాజ్‌ను తుది జట్టు నుంచి తప్పించడంపై మొదలైన చర్చ మాత్రం కొనసాగుతూనే ఉంది. సిరాజ్ కు తుదిజట్టులో చోటు లభించకపోవడంపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ఇప్పటికే వివరణ ఇచ్చాడు. ఇద్దరు సీమ్ బౌలర్లు, ఇద్దరు స్పిన్ బౌలర్ల కూర్పుతో బరిలో దిగుతున్నామని, అందుకే సిరాజ్ కు

ఓంకారంలో సివిల్ జడ్జి పూజలు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 21: కార్తీక మాసం సందర్భంగా నంద్యాల రెండవ అదనపు సివిల్ జడ్జి ఎస్ తంగమణి ఓంకార పుణ్యక్షేత్రంలో పూజలు నిర్వహించారు. సివిల్ జడ్జి తంగమణి ఓంకార దేవస్థానమునకు విచ్చేసిన సందర్భంగా ఆలయ చైర్మన్ అల్లే చెన్నారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగప్రసాద్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిద్దేశ్వర స్వామి వారికి అమ్మవారికి అభిషేకము కుంకుమార్చన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను సివిల్ జడ్జికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం ఓ ఎస్ డి ప్రియదర్శిని.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా కేంద్రంలో ఎన్నికల కవరేజీలో భాగంగా డిపిఆర్ఓ శాఖ కొన్ని పత్రికలకు ఎలక్షన్ పాసులు మంజూరు చేయలేదని కలెక్టర్



దృష్టికి తీసుకెళ్లి పాత్రికేయుల సమస్యను పరిష్కరిస్తామని ఓఎస్డి ప్రియదర్శిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పవన్ ,అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ ఎన్నికల కవరేజీలో డిపిఆర్ఓ శాఖ సిబ్బంది కొన్ని పత్రికలకు ఎలక్షన్ పాసులు ఇవ్వనందున పోలింగ్ బూతులలో పోలీసుల నుండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. చాలా జిల్లాలలో అన్ని పత్రికలకు ఎలక్షన్ పాసులు మంజూరు చేశారు. కావున జిల్లా కలెక్టర్ డిపిఆర్ఓ శాఖకు ఆదేశాలు ఇచ్చి మాకు ఎలక్షన్ పాసులు మంజూరు చేస్తారని, మా సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బొజ్జ నాగేంద్ర, మస్తాన్, మహేష్ యాదవ్, ఎస్ఎండి రఫీ ,నాగేంద్ర, ఇక్బాల్ , శీను, జై భరత్ రెడ్డి , ఎల్.నాగరాజు, పవన్, దాస్, మజీద్,తదితరులు పాల్గొన్నారు.

ఎంఎన్ఆర్ చిన్నపిల్లల ఆసుపత్రిని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని స్థానిక రామాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎన్ఆర్ చిన్నపిల్లల ఆసుపత్రిని నేడు మాజీ





ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ నిరంజన్ రెడ్డి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ నిరంజన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ప్రారంభమైన ఎం ఎన్ ఆర్ చిన్నపిల్లల ఆసుపత్రి ద్వారా 20 సంవత్సరాల నుండి చిన్నారులకు అత్యధిక వైద్య సేవలు అందిస్తున్నారు. మరిన్ని మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

నామినేషన్ల పరిశీలన కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని నాలుగు క్లస్టర్ నామినేషన్ పరిశీలన కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం సిఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ ఎల్. శివాంజల్ నామినేషన్ల కేంద్రాలను పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది సూచనలు చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్న కారణంగా అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై జిల్లా ఎస్పీ గారి ప్రత్యక్ష పర్యవేక్షణ.

- నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక గ్రామాల్లో పర్యటన -- కంపమల్ల పోలీస్ పికెట్ తనిఖీ.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లాలో



మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఐపీఎస్ పలు నామినేషన్ కేంద్రాలతో పాటు సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా కంపమల్ల గ్రామంలోని పోలీస్ పికెట్‌ను సందర్శించి గ్రామ భౌగోళిక పరిస్థితులు, ఎన్నికల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులు,శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టిన భద్రత చర్యలపై ఆరా తీశారు.



ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నామినేషన్ల ప్రక్రియ నుంచి ఎన్నికల నిర్వహణ వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు, అల్లర్లకు తావులేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైన ప్రాంతాల్లో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తూ పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ, ఎన్నికల నియమావళి అమలును పకడ్బందీగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియతో పాటు ఎన్నికలు కూడా స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా నంద్యాల జిల్లా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపడుతుందని తెలిపారు.

వైఎస్ఆర్సిపి నాయకుడిపై హత్యాయత్నం.

మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. శ్రీశైలం





నియోజకవర్గ పరిధిలోని శ్రీశైలంలో వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు పుల్లయ్యపై శుక్రవారం రాత్రి జరిగిన దాడి ఘటనను మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ దాడికి టీడీపీ వర్గీయులే కారణమని ఆయన ఆరోపించారు. దాడిలో తీవ్రంగా గాయపడి నంద్యాల జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పుల్లయ్యను శనివారం శిల్పా చక్రపాణి రెడ్డి మరియు వైఎస్ఆర్సిపి ముఖ్య నేతలు పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న ఆయన, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ పలు అంశాలను ప్రస్తావించారు.

దాడిపై ఆరోపణలు:

శ్రీశైలం దేవస్థానం పరిధిలో పుల్లయ్యపై టీడీపీకి చెందిన మణికంఠ, కాశయ్య, భూపాల్‌తో పాటు మరో పదిమంది కర్రలు, రాడ్లతో హత్యాయత్నానికి పాల్పడ్డారని శిల్పా ఆయన ఆరోపించారు. పవిత్ర పుణ్యక్షేత్ర ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమని అన్నారు.

ప్రభుత్వ పనితీరుపై విమర్శలు:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలు చేస్తోందని ఆయన విమర్శించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు మరియు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో వైఎస్ఆర్సిపి బలపరిచిన అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా టీడీపీ నాయకులు పోలీసుల సహకారంతో అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు.

హెచ్చరిక మరియు డిమాండ్లు:

ప్రస్తుతం జరుగుతున్న దాడులు, ఘటనలన్నింటినీ తాము 'డిజిటల్ బుక్'లో నమోదు చేస్తున్నామని, భవిష్యత్తులో వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, శ్రీశైలం ప్రాంతంలో ప్రశాంతతను కాపాడుతూ వైఎస్ఆర్సిపి నాయకులకు తగిన రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా ప్రపంచ టెలివిజన్ దినోత్సవం.

టీవీ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి సహకరిస్తాం: డాక్టర్ రవి కృష్ణ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. శనివారం



ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా నంద్యాల టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వ నగర్ మోడల్ ప్రైమరీ స్కూల్ బాలలకు పుస్తకాలు,పలకలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని టెలివిజన్ రూపకర్త బైర్డ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డాక్టర్ రవి కృష్ణ, అసోసియేషన్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సభ్యులకు,బాలలకు పంచిపెట్టారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ టెలివిజన్ సాంకేతికత నిరంతరం మార్పు చెందుతూ ఉంటుందని తదనుగుణంగా తమ పరిజ్ఞానాన్ని టీవీ టెక్నీషియన్స్ మెరుగుపరుచుకోవాలని, వినియోగదారుడికి నాణ్యమైన,నమ్మకమైన సేవలు అందించడం ద్వారా వృత్తిలో మంచి ఫలితాలు అందుతాయన్నారు. ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. నంద్యాల లో టీవీ టెక్నీషియన్స్ కు జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతిక పై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి సహకరిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలావతి,నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ సంఘం అధ్యక్షులు కన్నయ్య,నంద్యాల పట్టణ టీవీ టెక్నీషియన్ సంఘం గౌరవ అధ్యక్షులు జైపాల్,అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి,జిల్లా సంఘం ఉపాధ్యక్షులు రహీం,పట్టణ సంఘం ఉపాధ్యక్షులు ఇలియాస్,సెక్రెటరీ వీరారెడ్డి,జాయింట్ సెక్రెటరీ ఎల్లా గౌడ్,ట్రెజరర్ గోకారి,గౌరవ సలహాదారులు రెహమాన్,షేక్ మహబూబ్ బాషా, శివ యాదవ్,నంద్యాల పట్టణ టీవీ టెక్నీషియన్ సంఘం సభ్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బేతంచెర్ల మండలంలో తొలి రోజు నామినేషన్లకు విశేష స్పందన

-19 గ్రామపంచాయతీలకు 59 సర్పంచ్ నామినేషన్లు, 149 వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలు

బేతంచెర్ల పల్లెవెలుగు ప్రతినిధి 21:- బేతంచెర్ల మండల పరిధిలోని 19 గ్రామపంచాయతీలకు సంబంధించి ఏర్పాటు చేసిన 6 నామినేషన్ కేంద్రాల్లో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదటి రోజు ప్రశాంతంగా నిర్వహించబడింది. మండలంలోని మొత్తం 19 గ్రామపంచాయతీలకు 19 మంది సర్పంచులు, 194 వార్డు సభ్యుల స్థానాలు ఉండగా, నామినేషన్ల మొదటి రోజు సర్పంచ్ అభ్యర్థుల నుంచి 59 నామినేషన్లు, వార్డు సభ్యుల అభ్యర్థుల నుంచి 149



నామినేషన్లు స్వీకరించినట్లు రిటర్నింగ్ అధికారులు (ూా), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ూూా) వెల్లడించారు. మొదటి రోజే అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడంతో



గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. మండలంలోని అన్ని నామినేషన్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

చిన్నయరసాల అభివృద్ధే నా లక్ష్యం..

గెలిపిస్తే మాటల్లో కాదు చేతల్లో చూపిస్తా: కల్లూరి దశరథ రామిరెడ్డి

అమ్మడకుంట చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణకు కృషి.. డ్రైనేజీ, విద్యుత్, సీసీ రోడ్ల నిర్మాణానికి హామీ

పోరుమామిళ్ల, నవంబర్ 21 (పల్లె వెలుగు):వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం చిన్నయరసాల గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కల్లూరి దశరథ రామిరెడ్డి పోటీ చేస్తున్నారు. గతంలో 2005--06 సంవత్సరంలో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన ఆయన, మరోసారి గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రజల ముందుకు వచ్చారు. ఈసారి గ్రామ ప్రజలందరూ తనకు సహకరించి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.సర్పంచ్గా తనను గెలిపిస్తే మాటల్లో చెప్పడం కంటే చేతల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన ఆధ్వర్యంలో బలంగా కృషి చేసి, పోరుమామిళ్ల చెరువు నుంచి అమ్మడకుంట చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తీసుకురావడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.ఈ నీటి వసతి ద్వారా తిమ్మారెడ్డిపల్లె నుంచి సిద్ధమూర్తిపల్లె వరకు దాదాపు 11 చెరువులకు నీరు అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నిలిచిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థను తిరిగి పునఃప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అదేవిధంగా గ్రామపంచాయతీ పరిధిలో డ్రైనేజీ సమస్యల పరిష్కారం, విద్యుత్ సదుపాయాల మెరుగుదల, సీసీ రోడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానన్నారు.ఎవరి దగ్గరా ఒక్క రూపాయి ఆశించకుండా, తనకు వచ్చే జీతాన్ని సైతం గ్రామాభివృద్ధికి వినియోగిస్తూ, కార్యకర్తలు, గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతానని కల్లూరి దశరథ రామిరెడ్డి స్పష్టం చేశారు. గ్రామ ప్రజలు తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు.



అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా నంద్యాల జిల్లాలో ప్రతి నిరక్షరాస్యుడిని

అక్షరాస్యుడిగా తీర్చిదిద్దాలి.

-అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యం.
-మూడో దశకు సంబంధించి నిరక్షరాస్యుల గుర్తింపు, నమోదు, వెరిఫికేషన్ మరియు మ్యాపింగ్ ప్రక్రియను నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలి -- జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అక్షరాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు.

అక్షరాంధ్ర రెండో దశ అమలు

ప్రస్తుతం జిల్లాలో అక్షరాంధ్ర కార్యక్రమం రెండో దశ కొనసాగుతోంది. ఈ దశలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అక్షరాస్యత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. డి ఆర్ డి ఏ, బి డబ్ల్యు ఎం ఏ, ఎం ఈ పి ఎం ఏ శాఖల సమన్వయంతో వాలంటీర్ టీచర్ల సహకారంతో అభ్యాసకులకు అక్షరాస్యత పాఠాలు బోధిస్తున్నారు. అక్షరాస్యత కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఎంలు, ఏపీవోలు, సీసీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో వాలంటీర్ టీచర్లు తప్పనిసరిగా హాజరై బోధనా కార్యక్రమాలు నిర్వహించాలని, వారి హాజరును క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. అభ్యాసకుల హాజరును పెంచడంతో పాటు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా 100 గంటల అభ్యసనాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అక్షరాంధ్ర మూడో దశ -- 2027 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అక్షరాంధ్ర కార్యక్రమం మూడో దశను 2027 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ దశలో జిల్లాలో మిగిలి ఉన్న నిరక్షరాస్యులందరినీ గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ప్రధాన లక్ష్యం. 2027 సెప్టెంబర్లో అక్షరాస్యత మూల్యాంకన పరీక్ష నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

అక్షరాంధ్ర మొదటి, రెండో దశల్లో ప్రధానంగా 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టడం జరిగింది. అయితే, ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు 59 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులను కూడా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని నిర్ణయించిన నేపథ్యంలో, వారిని కూడా అక్షరాంధ్ర కార్యక్రమం పరిధిలోకి తీసుకురావడం జరిగింది. దీంతో 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులందరినీ గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

నంద్యాల జిల్లాలో 3,10,759 మంది నిరక్షరాస్యుల గుర్తింపు

నంద్యాల జిల్లాలో గుర్తించిన నిరక్షరాస్యుల వివరాలను ఇప్పటికే అక్షరాంధ్ర యాప్లో అప్లోడ్ చేయడం జరిగింది. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

15 నుంచి 59 సంవత్సరాల వయస్సు వారు: 1,49,718 మంది.

59 సంవత్సరాలు పైబడిన వారు: 1,61,041 మంది మొత్తం: 3,10,759 మంది.

ఈ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన నిరక్షరాస్యులను గుర్తించి వాలంటీర్ టీచర్లతో మ్యాపింగ్ చేయాలని తెలిపారు.

నవంబర్ నెలాఖరులోగా నమోదు, వెరిఫికేషన్ మరియు మ్యాపింగ్ పూర్తి చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ, వార్డు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు గ్రామాల్లోని వి వో ఏ లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో సంబంధిత సచివాలయ సిబ్బంది కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సి ఓ లు), రిసోర్స్ పర్సన్ల (ఆర్ పి ఎస్) సహకారంతో ఈ ప్రక్రియను చేపట్టాలన్నారు.

ఇప్పటికే అక్షరాస్యులైన వారు, మరణించిన వారు, వలస వెళ్లిన వారు, మంచానికే పరిమితమైన వారు మరియు మానసిక స్థితి సరిగా లేని వారిని నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం గుర్తించి జాబితా నుంచి తొలగించాలి. మిగిలిన అర్హులైన నిరక్షరాస్యుల వివరాలను ధృవీకరించి, అక్షరాంధ్ర యాప్లో నమోదు చేసి వాలంటీర్ టీచర్లతో మ్యాపింగ్ చేయాలన్నారు.ఈ నమోదు, డేటా వెరిఫికేషన్ మరియు మ్యాపింగ్ ప్రక్రియను 2026 నవంబర్ నెలాఖరులోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని అన్నారు.అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా నంద్యాల జిల్లాలో ప్రతి నిరక్షరాస్యుడిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.



ఇండ్ గ్యాప్ పొలంబడి క్షేత్ర పరిశీలన

బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 21: బండి ఆత్మకూరు మండల పరిధిలోని సింగవరం గ్రామంలో ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండి గ్యాప్ పొలంబడి వరి పంటను సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ మొహమ్మద్ సుహెల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు 30 మంది రైతులను మహానంది అరటి ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్ పి ఓ)తో అనుసంధానం చేసి 10 హెక్టార్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఏఓ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ (ఏపీఎస్ ఓ బి సి) సీట్ సర్టిఫికేషన్ అధికారి మొహమ్మద్ సుహెల్ మాట్లాడుతూ తక్కువ సాగు ఖర్చుతో మిత్ర పురుగులను సంరక్షిస్తూ, రసాయనిక పురుగు మందులు, ఎరువులను తగ్గించి, సేంద్రియ పదార్థాల వాడకంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి పొలంబడి ఉపయోగపడుతుందని అన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను సాధిస్తూ ఇండ్ గ్యాప్ సర్టిఫికెట్ పొందడం వల్ల రైతులు ఎగుమతి ప్రణాళిక అనుగుణంగా పంట నికర ఆదాయం పెంచుకోవచ్చని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వ్యవసాయ విస్తరణ అధికారి అష్రఫ్, లక్ష్మయ్య ఆర్ఎస్కే సిబ్బంది ప్రియాంక పలువురు రైతులు పాల్గొన్నారు.





మూడు గ్రామాల అభివృద్ధే నా ధ్యేయం

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో తనను సర్పంచ్గా గెలిపిస్తే మూడు గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ సీనియర్ నాయకులు బీవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలోని పశువుల, సూదిరెడ్డిపల్లి, నూతనపల్లె గ్రామాల సర్పంచ్ అభ్యర్థిగా శనివారం ఆయన తన నామినేషన్ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా బీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఈ మూడు గ్రామాల్లో ప్రజలు అనేక మౌలిక వసతుల లేమితో, వివిధ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే గ్రామాల రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామంలోని హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేయడంతో పాటు, ముస్లిం మైనారిటీలకు సంబంధించిన స్థలానికి ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మాణం వంటి దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రభుత్వ నిధుల కోసమే వేచి చూడకుండా, గ్రామాల అభివృద్ధి కోసం తన సొంత నిధులను సైతం వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన ప్రకటించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు వ్యక్తిగత ఖర్చుతో మూడు గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చారు. గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.







ఇండిపెండెంట్ అభ్యర్థి దార్ల దివ్య జ్యోతికి ఇంటింటా నీరాజనాలు!

శ్రీకాకుళం బ్యూరో చీఫ్ నవంబర్ 21 పల్లె వెలుగు

శ్రీకాకుళం నగరంలోని 45వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న దార్ల దివ్యజ్యోతికి ఇంటింటా అపూర్వమైన ఆత్మీయ స్వాగతం లభిస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్తున్న ఆమెకు స్థానిక మహిళలు హారతులు పట్టి స్వాగతం పలుకుతుండగా, కుటుంబ సభ్యులు, పెద్దలు ఆప్యాయంగా ఆహ్వానించి తమ మద్దతును తెలియజేస్తున్నారు. వారి కుటుంబం గత 50 సంవత్సరాలుగా ఇదే వార్డులో నివసిస్తుండటంతో స్థానిక ప్రజలతో వారికి సుదీర్ఘమైన అనుబంధం ఉంది. ఈ పరిచయం ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు కేవలం ఓటు అభ్యర్థించడమే కాకుండా, ఇంట్లో కూర్చొని కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం కలుగుతోంది.

ముఖ్యంగా కత్తెర వీధి నుంచి పోటీ చేస్తున్న దార్ల దివ్యజ్యోతికి ఎన్నికల గుర్తుగా కత్తెర లభించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వీధి పేరు, ఎన్నికల గుర్తు ఒకే విధంగా ఉండటం ఓటర్లకు గుర్తుంచుకోవడానికి సులభంగా ఉంటుందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ప్రచారంలో లభిస్తున్న ఆత్మీయ స్వాగతాలు, ప్రజలతో ఉన్న పాత పరిచయాలు, ఇంటింటా సాగుతున్న మమేకం ప్రస్తుతం 45వ వార్డులో ఎన్నికల ప్రచారానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తున్నాయి.





ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్పి

నూతన కర్నూల్ నగర కమిటీ ఎన్నిక,



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూల్ నగరం అంబేద్కర్ భవన్లో ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్పి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో దళితుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఇంచార్జ్ నాయకులు దుమ్ము చిన్న అన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కర్నూలు నగర నూతన కమిటీ ని అంబేద్కర్ భవన్ లో దుమ్ము చిన్న అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు రాచపూడి ఆనంద్, సుభాష్ చంద్రబోస్, కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్, భాస్కర్, పాముల కుమార్,కే. సూరి,అన్నెపోగు రవి తదితరులు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు గా సంధ్య మనోహర్, ఉపాధ్యక్షుడు గా అరెపోగు రవి, అధికార ప్రతినిధిగా లక్ష్మన్న, ఎంఎస్పీ నగర అధ్యక్షుడు గా బీదల అన్నగారి రవికుమార్, అధికార ప్రతినిధిగా ప్రసాద్ ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కమిటీ నాయకులను ఘనంగా సన్మానించారు. ఎస్సీ వర్గీకరణ పోరాట ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న సీనియర్ నాయకులను ప్రత్యేకంగా సన్మానించారు. నూతన కమిటీ నాయకులు దళితుల అభివృద్ధి కోసం కృషి చేయాలని సీనియర్ నాయకులు సూచించారు. డిశంబర్ 17న అమరావతిలో జరిగే దళితుల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని దుమ్ము చిన్న దళిత ప్రజలను కోరారు. అనంతరం దుమ్ము చిన్న, సుభాష్ చంద్రబోస్, ఎమ్మార్పీఎస్ నూతన నగర అధ్యక్షుడు సంధ్య మనోహర్లు మాట్లాడారు.

వివాహ వేడుకకు హాజరయిన బీసీ ఇందిరా రెడ్డి



బనగానపల్లె నవంబర్ 21,పల్లెవెలుగు తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామానికి చెందిన కోట లక్ష్మి భవాని మరియు రంగనాథ రెడ్డి దంపతుల ఆహ్వానం మేరకు తాడిపత్రి పట్టణంలోని ఏ. ఎన్. ఆర్ గార్డెన్ నందు ఏర్పాటు చేసిన వారి కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి

వివాహ వేడుకకు హాజరయి వధూవరులను ఆశీర్వదించిన బీసీ ఇందిరా రెడ్డి



బనగానపల్లె, నవంబర్ 21,పల్లెవెలుగు బనగానపల్లె మండలం కాపులపల్లె గ్రామానికి చెందిన ఆవుల దస్తగిరమ్మ మరియు రామచంద్రారెడ్డి దంపతుల ఆహ్వానం మేరకు బనగానపల్లె పట్టణంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన వారి కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి

సర్పంచ్ అభ్యర్థిగా జగన్నాథ్ రెడ్డి,,,,,

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా,,,,,



నందవరం పల్లె వెలుగు నవంబర్ 21 ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నందవరం మండల పరిధిలోని హాలహర్వి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా జగన్నాథ్ రెడ్డి . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బి. జయనాగేశ్వర రెడ్డి ఆశీస్సులతో వారు సర్పంచ్ గా పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని సర్పంచ్ భారీ మెజారిటీ గెలిపించి కానుకగా ఇస్తానన్నారు. అలాగే గ్రామ అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే బీవీ తో నే సాధ్యమని అందుకు మన గ్రామ ప్రజలు సర్పంచ్ గా గెలిపించాలను ప్రజలను కోరారు.

ఉమాపతి నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన జడ్పీ చైర్మన్ ఉల్లిగయ్య.

ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన చూడి ఉల్లిగయ్య ఆదోని పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ సీనియర్



నాయకులు కొంకా ఉమాపతి నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడుతో ఉల్లిగయ్య ఆత్మీయంగా సమావేశమై పలు విషయాలపై చర్చించారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఉల్లిగయ్యకు ఉమాపతి నాయుడు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు పదవులు దక్కడం సంతోషకరమని, నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉల్లిగయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా పరిషత్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంపై మంత్రి బీసీ దిగ్భ్రాంతి

బనగానపల్లె , నవంబర్ 21, పల్లెవెలుగు ప్రకాశం జిల్లా పెళ్లూరు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు ,మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి పత్రికా ప్రకటన ద్వారా ప్రకాశం జిల్లా పెళ్లూరు సమీపంలో జరిగిన ప్రమాదం పై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని,పెళ్లి వేడుకకు వెళ్లి తిరిగి వస్తున్న కుటుంబంలో ఈ విషాదం చోటుచేసుకోవడం కలచివేసిందని మంత్రి బీసీ తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని,క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు

గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి.

● పోలింగ్ కేంద్రాల వారీగా కాకుండా గదుల వారీగా సీసీ కెమెరాలు, వీడియోగ్రాఫర్లు, సిబ్బంది వివరాలు సిద్ధం చేయాలి. ● మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్. ● నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలతో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నేడు (21వ తేదీ) నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనున్న నేపథ్యంలో తుది పోటీదారుల జాబితాను అదే రోజు ఖరారు చేయాలని ఆదేశించారు. ఏకగ్రీవమైన స్థానాల వివరాల ఆధారంగా రవాణా ఏర్పాట్లు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను మరోసారి సమీక్షించుకోవాలని, అవసరమైన సీసీ కెమెరాలు, వీడియోగ్రాఫర్లు, సిబ్బందిని ముందుగానే కేటాయించాలని సూచించారు.

మొదటి విడత ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఈ నెల 23వ తేదీన ఆయా మండల కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో పోలిస్తే గ్రామ పంచాయతీ ఎన్నికలు అత్యంత కీలకమైనవని, పోలింగ్ ముగిసిన వెంటనే మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఒకే గదిలో ఒకటి కంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్లు ఉండే అవకాశం ఉన్నందున, పోలింగ్ కేంద్రాల వారీగా కాకుండా గదుల వారీగా సీసీ కెమెరాలు, వీడియోగ్రాఫర్లు, సిబ్బంది వివరాలను సిద్ధం చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు.

రెండో విడత ఎన్నికల పరిధిలోని బనగానపల్లె, పాణ్యం, ఆత్మకూరు ప్రాంతాల్లో నేడు నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై వచ్చే అప్పీళ్లను సంబంధిత ఆర్డీఓలు, సబ్ కలెక్టర్లకు పంపించి ఎన్నికల నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. రెండో విడత ఎన్నికల సిబ్బందికి నవంబర్ 25వ తేదీన శిక్షణతో పాటు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.మూడో విడత ఎన్నికల పరిధిలోని నందికొట్కూరు, డోన్ ప్రాంతాల్లో నేడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల లోపల, బయట సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడో విడత ఎన్నికల సిబ్బందికి నవంబర్ 28వ తేదీన శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అవగాహన కల్పించి, ఆ సదుపాయాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులు, స్టేషనరీ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, ఎన్నికల యంత్రాంగం పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తెలిపారు.

కొండెక్కిన వాటర్ ప్యాకెట్ ధరలు”




పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల జిల్లా, నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామంలో వాటర్ ప్యాకెట్ ధరలకు రెక్కలు వచ్చాయి. వివరాల్లోకి వెళితే చాపిరేవుల గ్రామము, పాండురంగాపురం గ్రామానికి వెళ్లే రాస్తా లో ఒక వ్యాపారి ఒక్క రూపాయకు అమ్మవలసిన వాటర్ ప్యాకెట్లు ఏకముగా మూడు రూపాయలకు అమ్ముతున్నారు. ఒక్క రూపాయ అమ్మవలసిన వాటర్ గ్లాస్ ఏకముగా మూడు రూపాయలు అమ్ముతుండడంతో గ్రామ ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. వాటర్ ప్యాకెట్, వాటర్ గ్లాసు వ్యాపారులు ఏకముగా మూడు రూపాయలు అమ్మకాలు చేస్తుండడంతో గ్రామ ప్రజలు ప్రశ్నించగా ఇష్టమైతే తీసుకోండి, లేకుంటే వెళ్ళండి మీ ఇష్టం వచ్చిన అధికారులకు చెప్పుకోండి అని దబాయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో అధిక ధరలకు అమ్ముతున్న ప్రతి వస్తువుపై తనిఖీ చేయవలసిన ప్రభుత్వ అధికారులు పత్తా లేరని, అధికారులకు అందవలసిన మామూలు అందుతూ ఉండడంతో అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ కార్యాలయాలలో ఫెవికిక్ ల అతుక్కుపోయి తమ సీట్లకే పరిమితమయ్యారని గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. 100 వాటర్ ప్యాకెట్ల గల వాటర్ సంచి 70 రూపాయలు కొనుగోలు ఉందని, వాటర్ ప్యాకెట్టు ఒక్క రూపాయ అమ్మకాలు జరపకుండా వ్యాపారులు ఏకముగా మూడు రూపాయలు అమ్మకాలు జరుగుతున్నాయని గ్రామ ప్రజలు తెలిపారు. ఏదేమైనా గ్రామాలలో అధిక ధరలను నియంత్రించి, అధిక ధరలకు విక్రయిస్తున్న వస్తువులపై జిల్లా అధికారులు స్పందించి అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



గుర్తులు రాకముందే గుప్పిట్లోకి





బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 21: బండి ఆత్మకూరు మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో పోటీ చేస్తున్న వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులకు గుర్తులు రాకముందే, ఓటర్ మహాశయులను తమ గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ కి సంబంధించి ఒకవైపు పరిశీలనా కార్యక్రమాలు జరుగుతూ ఉంటే, మరోవైపు గ్రామాలలో నాయకులు ప్రచారం చేసుకుంటున్నారు. అభ్యర్థులకు గుర్తులను కేటాయించేందుకు మరో మూడు రోజులు సమయం ఉంది కాబట్టి, ఆలోపుగా ప్రజలతో పరిచయాలు పెంచుకునేందుకుగాను, తెలుగుదేశం వైఎస్ఆర్ పార్టీలకు చెందిన నాయకులు గ్రామాలలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సర్పంచి పదవులకు పోటీచేసే అభ్యర్థులతో పాటు, వార్డు సభ్యులను కూడా వెంటబెట్టుకొని ప్రచారం చేసుకుంటున్నారు. గ్రామాలలో ఈ ఎన్నికలకు వార్డు సభ్యులే కీలకం కావడంతో, ఎలాంటి రాజకీయ అనుభవం లేని వ్యక్తులను ఎన్నికల రంగంలోకి దించారు. ముందు నువ్వు నామినేషన్ వేసేయ్! తర్వాత మేము చూసుకుంటాం! అంటూ వార్డు సభ్యులను బుజ్జగించి మరి నామినేషన్లను వేయించారు. ఏదో నాయకులు చెప్పారు కదా! అని మొదట్లో సంబర పడిన వార్డు సభ్యులకు, ప్రచారం మొదట్లోనే ఖర్చుల భయంతో బేజారెత్తిపోతున్నారు. ఇప్పటికే మండలంలోని బండి ఆత్మకూరు పార్నపల్లె కాకునూరు ఎర్రగుంట్ల ఏ కోడూరు, సంత జూటూరు భోజనం పెద్దదేవలాపురం నారాయణపురం చిన్నదేవలాపురం, లింగాపురం గాలి చెన్నయ్యపాలెం, రామాపురం సోమయాజుల పల్లె, ఈర్నపాడు ,కడమల కాల్వ, వెంగళరెడ్డిపేట గ్రామపంచాయతీ పరిధిలో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు ప్రచారంలో పడి మునిగి తేలుతున్నారు. ఓటర్ మహాశయులను ప్రసన్నం చేసుకునేందుకు కుస్తీ పడుతున్నారు. గ్రామాలలో సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థుల కంటే, వార్డుల నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులే ప్రధానంగా ప్రచారం చేసుకుంటున్నారు. వార్డుకు నేనే నిలబడ్డాను! మీరు నాకు కచ్చితంగా ఓటు వేసి గెలిపించాలి! అమ్మా ! అక్కా! అంటూ ఇప్పటినుండే ప్రాధేయపడుతున్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యత,

ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలి.

-ఓటరు నమోదు నుంచి ఓటు వినియోగం వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.

-ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటు ప్రాధాన్యత, ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు, ఎన్నికల వ్యవస్థపై విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. యువతలో ఓటు హక్కుపై చైతన్యం పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను తెలియజేసేందుకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా నిర్వహిస్తున్న వ్యాసరచన, క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారతదేశం ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా అవతరించడానికి రాజ్యాంగం కీలకమని, ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజలచే ఎన్నుకోబడే ప్రభుత్వమే ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాతిపదిక అని వివరించారు. ప్రజల అభిప్రాయాలకు ప్రతినిధులుగా ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అధికారం ఓటు ద్వారా లభిస్తుందని, అందువల్ల ప్రతి ఓటరు తన ఓటు విలువను గుర్తించి బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఓటు హక్కు వినియోగంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ఎన్నికల్లో ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత కూడా అని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎన్నో ఇబ్బందులను అధిగమించి ఓటు హక్కును వినియోగించుకుంటున్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలలో ఓటింగ్ శాతం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు వేయడానికి సమయం లేదనే భావనతో ప్రజాస్వామ్య ప్రక్రియకు దూరంగా ఉండకూడదని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని తెలిపారు. ఒక్క ఓటు కూడా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలదని, కేవలం ఒక్క ఓటు తేడాతో అభ్యర్థులు విజయం సాధించిన సందర్భాలు ఉన్నాయని ఉదాహరణగా వివరించారు. కాబట్టి ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా, డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా అభ్యర్థుల గురించి తెలుసుకొని విచక్షణతో ఓటు వేయాలని సూచించారు.

యువత ఓటరు నమోదుపై అవగాహన పెంచుకోవాలి

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, 17 సంవత్సరాల వయస్సు నుంచే ముందస్తు ఓటరు నమోదుకు ఫారమ్-6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం, ఎన్నికల విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన అవసరం

భారత ఎన్నికల సంఘం పార్లమెంటరీ, శాసనసభ ఎన్నికలను నిర్వహిస్తుందని, రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తుందని కలెక్టర్ వివరించారు. గ్రామస్థాయిలో వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయిలో ఎంపీటీసీలు, జిల్లా స్థాయిలో జెడ్పీటీసీలు ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తారని, ఈ ప్రజాప్రతినిధుల ఎన్నికల్లో ఓటు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

ప్రజాప్రతినిధులు ప్రజల అవసరాలకు అనుగుణంగా విధానాలను రూపొందిస్తే, వాటిని అర్హులైన ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని వివరించారు. భవిష్యత్తులో విద్యార్థులు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా ఏ రంగంలో ఉన్నా సమాజాభివృద్ధి పట్ల బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

విజయం, వైఫల్యాలను సమతుల్యంగా స్వీకరించాలి

విద్యార్థులు తమకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పోటీల్లో విజయం సాధించినప్పుడు అహంకారానికి తావివ్వకుండా, వైఫల్యం ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా మరింత కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రూప్ డిస్కషన్లు, నాయకత్వ లక్షణాలు, పరస్పర సహకారం, ఇతరుల అనుభవాల నుంచి సూచించారు.







జిల్లాస్థాయిలో 20 మంది విద్యార్థుల ఎంపిక

ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ విద్యాసంస్థల్లో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రతి విద్యాసంస్థ నుంచి ఇద్దరు విజేతలను ఎంపిక చేశారు. అనంతరం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వ్యాసరచన విభాగంలో 10 మంది, క్విజ్ విభాగంలో 10 మంది చొప్పున ఎంపిక చేసి జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వ్యాసరచన విభాగంలో 10 మంది, క్విజ్ విభాగంలో 10 మంది విద్యార్థులు, మొత్తం 20 మందిని జిల్లా స్థాయి విజేతలుగా ఎంపిక చేశారు. వారందరికీ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెలో హజ్రత్ సయ్యద్ మీర్ హాషం అలీ ఉర్సు మహోత్సవాలు

-ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, నవంబర్ 21,పల్లెవెలుగు



బనగానపల్లె పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో కొలువైన హజ్రత్ సయ్యద్ మీర్ హాషం అలీ ఉర్సు దెహలివాలే సాహెబ్ రహ్మతుల్లా అలైహి వారి గంధం, ఉర్సు మహోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బనగానపల్లెలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఉర్సు మహోత్సవాల నిర్వాహకులు కార్యక్రమ వివరాలను మంత్రికి వివరించారు. నవంబర్ 30న రాత్రి 10 గంటలకు గంధం కార్యక్రమం, డిసెంబర్ 1న ఉర్సు మహోత్సవం, డిసెంబర్ 2న జియారత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గంధం కార్యక్రమంలో చాందిని డెకరేషన్, ప్రత్యేక లైటింగ్, డ్రమ్స్ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకునేలా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 1న రాత్రి 9 గంటలకు ఉత్తరప్రదేశ్ (లక్నో)కు చెందిన కళాకారులతో ముఖాముఖి పోటీల రూపంలో ప్రత్యేక ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించనున్నారు. హజ్రత్ సయ్యద్ అహ్మద్ బాషా ఖాద్రి రహ్మతుల్లా అలైహి వారి కుమారులు డాక్టర్ హుసేనిబాషా సాహెబ్ ఆధ్వర్యంలో గంధం, ఉర్సు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఖవ్వాలి కార్యక్రమానికి సహకారంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రూ.లక్ష విరాళంగా అందించారు. కార్యక్రమ నిర్వహణకు పలువురు దాతలు, ఆహ్వాన కమిటీ సభ్యులు, దర్గా కమిటీ సభ్యులు సహకారం అందిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో మతసామరస్యం, సోదరభావం వెల్లివిరిసేలా భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

రుద్రవరం మోడల్ స్కూల్ విద్యార్థి రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీ కి ఎంపిక.....

రుద్రవరం. పల్లె వెలుగు : జిల్లా స్థాయిలో నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమం ఎన్నికల అక్షరాస్యతా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాల రుద్రవరం 10వ తరగతి విద్యార్థి శశిధర్ తన ప్రతిభను చాటుకున్నాడు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి, త్వరలో



నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నమూనా శాసనసభ (మాక్ అసెంబ్లీ) కార్యక్రమానికి ఎంపిక కావడం పాఠశాలకు ఎంతో గర్వకారణం. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా చేతుల మీదుగా విద్యార్థి శశిధర్ ప్రశంసాపత్రాన్ని అందుకోవడం విశేషం. ఈ విజయానికి విద్యార్థికి మార్గదర్శనం చేసి, ప్రోత్సాహం అందించిన పాపయ్య , లక్ష్మీ వెంకట రమణ ఉపాధ్యాయులు, ఇంచార్జీ ప్రిన్సిపాల్ ఈరన్న బషీర్ ప్రత్యేక కృషి, సహకారం ఎంతో అభినందనీయం. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు గనాగేశ్వరరావు విద్యార్థి శశిధర్ ను, మార్గదర్శక ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థి విజయానికి సహకరించిన ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక అభినందనలు. ఈ విజయం మరెంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాము అన్నారు.

జిల్లా పరిషత్ చైర్మన్ ఉల్లిగయ్యకు ఘన సన్మానం.

ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా పరిషత్ ఉల్లిగయ్యకు శాలువా కప్పి ఘనంగా



చైర్మన్‌గా ఎన్నికైన చూడి ఉల్లిగయ్యకు ఆదోని పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఆదోని పట్టణంలోని మారుతి నాయుడు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, తెలుగు యువత నాయకుడు మారుతి నాయుడు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి వెంకటేష్ చౌదరి పాల్గొని సత్కరించారు. ఈ సందర్భంగా భూపాల్ చౌదరి మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు నాయకత్వంలో పనిచేస్తూ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా చూడి ఉల్లిగయ్య అంకితభావంతో కృషి చేశారని కొనియాడారు. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, వ్యక్తిగతంగా నష్టాలను చవిచూసినా పార్టీ జెండాను వీడకుండా పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమించిన నాయకుడని పేర్కొన్నారు. అటువంటి నిబద్ధత కలిగిన కార్యకర్తకు జిల్లా పరిషత్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కర్నూలు జిల్లాలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు టీడీపీ అధిష్ఠానం ఇస్తున్న గౌరవం, గుర్తింపుకు ఉల్లిగయ్యకు దక్కిన జిల్లా పరిషత్ చైర్మన్ పదవి నిదర్శనమన్నారు.

"కార్యకర్తే పార్టీకి అధినేత" అనే భావనకు ఉల్లిగయ్యకు దక్కిన జిల్లా పరిషత్ చైర్మన్ పదవే నిదర్శనం అని భూపాల్ చౌదరి పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు టీడీపీ అధిష్ఠానం అండగా ఉంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆదోని టీడీపీ పట్టణ అధ్యక్షుడు, 48వ వార్డు కౌన్సిలర్ వాల్మీకి తిమ్మప్ప, కౌన్సిలర్లు జయరాం, రవి, ముజీబ్ అహ్మద్, కౌతాళం టీడీపీ మండల అధ్యక్షుడు సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, కొంక రామకృష్ణ, వినయ్, జేపీ వెంకటేష్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువు మండలాల్లో 100 శాతం ఉపాధి కల్పించాలి....

రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల (ఆళ్లగడ్డ, దొర్నిపాడు, చాగలమర్రి, ఉయ్యాలవాడ, రుద్రవరం తదితర) వి.బి.జి. రామ్ జీ సిబ్బందితో పీడీ సూర్యనారాయణ మండలాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించినందున ప్రతి గ్రామంలోనూ 100 శాతం ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. గ్రామాలలో యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్న శ్రామికులలో కనీసం 70 నుండి 75 శాతం మందికి తప్పనిసరిగా పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏల వారీగా లక్ష్యాలను సమీక్షించిన ఆయన, పని కల్పించడంలో నిర్లక్ష్యం వహించే ఫీల్డ్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నంద్యాల ఏపీడీ సాంబశివరావుతో పాటు ఆరు మండలాల ఏపీఓలు, డీఆర్‌పీ, ఈసీలు, టీఏలు, సీఓలు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలల దినోత్సవ వేడుకలు ఘనం

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని



నగరంలోని కృష్ణానగర్ భాష్యం కే-4 పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్ఓ రాంప్రసాద్ హాజరై జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, క్రీడలపై అవగాహన పెంచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.
వేడుకల్లో భాగంగా విద్యార్థులు జానపద, ఆధునిక గీతాలకు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, హెచ్ఎం సురేఖ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెళ్లూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై మంత్రి బీసీ దిగ్భ్రాంతి

బనగానపల్లె , నవంబర్ 21, పల్లెవెలుగు ప్రకాశం జిల్లా పెళ్లూరు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు ,మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి పత్రికా ప్రకటన ద్వారా ప్రకాశం జిల్లా పెళ్లూరు సమీపంలో జరిగిన ప్రమాదం పై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని,పెళ్లి వేడుకకు వెళ్లి తిరిగి వస్తున్న కుటుంబంలో ఈ విషాదం చోటుచేసుకోవడం కలచివేసిందని మంత్రి బీసీ తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని,క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు

మహానంది మండలంలో ముగిసిన నామినేషన్ల పరిశీలన

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు రెండవ



విడత జరిగిన నామినేషన్ల ఎన్నికలకు సంబంధించి పరిశీలన ప్రక్రియ శనివారం ముగిసింది. మండలంలోని మొత్తం 106 సర్పంచులకు నామినేషన్లు దాఖలు కాగా 1 నామినేషన్ తిరస్కరించడం జరిగిందని, అలాగే 358 వార్డు సభ్యులకు 14 నామినేషన్లు తిరస్కారానికి గురయ్యాయి అని ఎంపీడీఓ మహమ్మద్ దౌల తెలిపారు. దీంట్లో రెండు దరఖాస్తులను అభ్యర్థులు సమర్పించగా ఒక దరఖాస్తును తిరస్కరించడంతో, ఆ దరఖాస్తులు 19 రిజెక్ట్ అయినట్లు తెలిపారు.కుల ధ్రువీకరణ పత్రం సరైనది లేకపోవడంతో 1 నామినేషన్ తిరస్కరించామన్నారు. మండలంలో మొత్తం సర్పంచ్లు 86, వార్డు సభ్యులు 344 ఆమోదించినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల పరిశీలన ముగిసింది.

ఐదుగ్రామపంచాయతీలు ఏకగ్రీవం

--ఆరు గ్రామపంచాయ తీలలో పోటీ

దొర్నిపాడు నవంబర్ 21 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు గాను 5 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగ,ఆరు గ్రామపంచాయతీలో గట్టిపోటీనెలకొంది మండలంలోని దొర్నిపాడు, కొత్తపల్లి,చాకరాజు వేముల,అమ్మిరెడ్డి నగర్ రామచంద్రాపురం,గ్రామపంచాయతీలు ఏకీకృమయ్యాయి, కిష్టిపాడు,గుండుపాపల
,బురారెడ్డిపల్లె,కొండాపురం,గోవిందిన్నేఅర్జునాపురం,
గ్రామాలలో పోటీలో అభ్యర్థులుఉన్నారు ఏకగ్రీవమైన అభ్యర్థుల



-పగడాల బాల నర్సమ్మ



చక్రవర్తి నాయుడు



పెద్ద ఓబులేసు



బబ్బురి లక్ష్మిశిరీష,

అమ్మిరెడ్డి నగర్ చక్రవర్తి నాయుడు, కొత్తపల్లి పెద్ద ఓబులేసు ,రామచంద్రాపురం బబ్బూరిలక్ష్మీశిరీష ,దొర్నిపాడు పగడాలబాలనరసమ్మ,చాకరాజువేముల మహబూబ్ బి ఏకగ్రీవమయ్యారు, దొర్నిపాడు వైస్ చైర్మన్ గబత్తుల సుశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలి

-నామినేషన్ పత్రాలు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అభ్యర్థులకు రసీదులు అందజేయాలి

-నామినేషన్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల మేరకు ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు స్వర్ణ గ్రామ కార్యాలయంలో నిర్వహిస్తున్న మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్..నామినేషన్ల స్వీకరణ విధానం, అభ్యర్థులు సమర్పిస్తున్న నామినేషన్ పత్రాలు, వాటికి జత చేస్తున్న ధ్రువపత్రాలు, రిజిస్టర్ల నిర్వహణ, అభ్యర్థులకు అందిస్తున్న సేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి నమోదు చేస్తున్నారా, నామినేషన్లు స్వీకరించిన అనంతరం సంబంధిత రసీదులు అందజేస్తున్నారా అనే అందించాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు నామినేషన్ పత్రాల భర్తీలో సహకారం అందించేందుకు హెల్ప్‌డెస్క్ సేవలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని పత్రాలను స్వీకరించి, వాటి వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలన్నారు. నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ)



అంశాలను పరిశీలించారు. అభ్యర్థుల వారీగా, వార్డుల వారీగా ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహిస్తూ అభ్యర్థుల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలు, నామినేషన్ సమర్పించిన సమయం, రుసుము చెల్లింపు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అలాగే అభ్యర్థులకు అవసరమైన చెక్‌లిస్టులు, ఎన్నికల వ్యయానికి సంబంధించిన ఫారాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నామినేషన్ల సమర్పణ సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మార్గదర్శకాలు ప్రక్రియకు సంబంధించి అభ్యర్థులకు అవసరమైన సూచనలు ముందుగానే తెలియజేయాలని, ప్రతి దశలోనూ ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రంలో ఇప్పటివరకు స్వీకరించిన నామినేషన్ల సంఖ్య, వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కర్నూలు రూరల్ తహశీల్దార్ వెంకట రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యం.. సర్పంచ్ గంగుల సరళమ్మ .

రుద్రవరం.పల్లె వెలుగు: ఎర్రగుడిదిన్నే



గ్రామపంచాయతీ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యంగా సర్పంచ్ గా ఎన్నికైన గంగుల సరళమ్మ తెలిపారు. రుద్రవరం మండలంలోని యర్రగుడిదిన్నె గ్రామ పంచాయతీ ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.
యర్రగుడిదిన్నె గ్రామపంచాయతీ సర్పంచ్ గా ముచ్చటగా మూడవసారి గంగుల సరళమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆర్వో చేతుల మీదుగా ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకున్నారు. గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన సరళమ్మను వార్డు సభ్యులు కుటుంబ సభ్యులు గ్రామస్తులు పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ ఉప సర్పంచ్ గా గంగుల సుదర్శన్ రెడ్డిని వార్డు సభ్యులు ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన కుటుంబ సభ్యులతో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సహకారంతో గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని సర్పంచ్ గంగుల సరళమ్మ తెలిపారు.
ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, పుటాలమ్మ క్షేత్రం మాజీ చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. గంగుల సరళమ్మ మూడోసారి సర్పంచ్గా ఎన్నిక కావడం జరిగిందన్నారు. మొదటి నుంచి తమ కుటుంబం గ్రామం కోసం ఎంతో కష్టపడుతోందని, తమకు తోడుగా ఆమె కూడా ఇప్పటివరకు తన సహాయ సహకారాలు అందిస్తూ వచ్చారని పేర్కొన్నారు.
ఇకముందు కూడా యర్రగుడిదిన్నె గ్రామంతో పాటు మజరా గ్రామమైన మాచినేనిపల్లె, ఈ రెండు గ్రామాలను అభివృద్ధిలో సమానంగా చూసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పాటుపడతామని పత్రికాముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గంగుల విజయసింహారెడ్డి, గంగుల పుల్లారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్, మాజీ సర్పంచ్ సీలయ్య తోపాటు వార్డు సభ్యులు పలువురు వైసీపీ నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ,,,,,,

ఎస్పై ఎం .తిమ్మారెడ్డి,,,,
కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐ,పీఎస్





ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు సబ్ డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఏ. శ్రీనివాసులు పర్యవేక్షణలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, శాంతి భద్రతల దృష్ట్యా నేరాలను నియంత్రణ చేయడంలో భాగంగా ఈ రోజు అనగా 21-11-2026వ తేదీన ఉదయము 06.00 గంటలకు నందవరం మండలములోని హలహర్వి గ్రామంలో నందవరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. తిమ్మారెడ్డి సిబ్బంది మరియు గ్రామస్థులు 20 మంది కలసి కార్డెన్ అండ్ సెర్చ్ (గ్రామాన్ని చుట్టు ముట్టి శోదించడం) నిర్వహించినారు. గ్రామములో కేడీలు, సస్పెక్ట్స్ (అనుమానితులు), రౌడీ(గుమాని)షీటర్స్ ల యొక్క ఇళ్లను తనిఖీ చేసి వారిని మరియు వివాస్పద వ్యక్తులకు సత్ప్రవర్తనతో మెలగాలని అల్లర్లు, గొడవలు చేసి నేరాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించమని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి, గ్రామములో పోలీసులు కవాతు నిర్వహించినారు. అనంతరం ఎస్పై ఎం .తిమ్మారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసుకునేందుకు, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటామని ప్రజలు ఎవరూ భయపడనవసరం లేదని మీకు పోలీసు శాఖ అండగా వుంటుందని ప్రజలకు భరోసా కల్పించినారు. అలాగే మద్యం తాగుట, గంజాయి వాడటం, పేకాట, మట్కా వంటి జూదములు ఆడడము వంటి చెడు అలువాట్ల వలన కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి వాడటము వలన యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, కుటుంబము ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన 1972 కు మరియు సైబర్ నేరాలు గురించి అప్రమత్తంగా వుండాలని, సైబర్ మోసాలు జరిగితే 1930 కు ఫోన్ చేయాలని, మైనర్ బాలికలకు వివాహము చేయరాదని ఎవరైనా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినారు.
తనిఖీలలో భాగంగా నల్లబోతుల రవి, తండ్రి: ధర్మయ్య, వయసు 27 సంవత్సరాలు, హలహర్వి గ్రామం, నందవరం మండలం అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 20 క్వార్టర్ బాటిలను స్వాధీనం చేసుకున్నారు

సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల విజయమే లక్ష్యంగా,,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు నవంబర్ 21 ఎమ్మిగనూరు



శాసనసభ్యులు డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు, కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ సూచనలతో గోనెగండ్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి తలారి మురళి నాయుడు తో పాటు వార్డు సభ్యుల అభ్యర్థులను గెలిపించాలని లక్ష్మీపేట, నాయి బ్రాహ్మణ కాలనీలలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు కోరుతూ, గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి అభ్యర్థులకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. సర్పంచ్ అభ్యర్థి తలారి మురళి నాయుడు తో పాటు వార్డు సభ్యుల అభ్యర్థుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తున్నారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల సహకారంతో గోనెగండ్లలో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారనే ధీమాను నాయకులు వ్యక్తం చేశారు.

ఖచ్చితమైన జనాభా గణన గణాంకాలే జిల్లా, రాష్ట్ర, దేశ అభివృద్ధికి పునాది.

జనాభా గణనలో ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి వివరాలను క్షేత్రస్థాయిలో వాస్తవికంగా నమోదు చేయాలి.
సెన్సెస్ గణాంకాల ఆధారంగానే ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పన.
ఎన్యూమరేటర్లు పూర్తి నిబద్ధతతో, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జనాభా గణన (సెన్సెస్) ప్రక్రియలో సేకరించే ప్రతి ఒక్క సమాచారం అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, ఖచ్చితమైన జనాభా గణాంకాలే జిల్లా, రాష్ట్ర, దేశ అభివృద్ధికి పునాది అని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు. జనాభా గణన ద్వారా సేకరించిన వివరాల ఆధారంగానే భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు రూపొందించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తారని తెలిపారు. శనివారం నంద్యాల పట్టణంలోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన సెన్సెస్ శిక్షణ కార్యక్రమం చివరి రోజు జిల్లా కలెక్టర్ పాల్గొని మాస్టర్ ట్రైనర్లు, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు జనాభా గణన ప్రాధాన్యత, వివరాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు.

డేటా నాణ్యత, బాధ్యతాయుత విధుల నిర్వహణ

సుదీర్ఘ విరామం అనంతరం నిర్వహిస్తున్న జనాభా గణన ద్వారా జిల్లాలోని వాస్తవ జనాభా, కుటుంబాల స్థితిగతులు, ప్రజల అవసరాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. గతంలో 2011 జనాభా గణాంకాలనే ప్రాతిపదికగా తీసుకుని పలు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాల్సి వచ్చిందని, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో జనాభా, నివాస ప్రాంతాలు, మౌలిక సదుపాయాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్యూమరేటర్లు కార్యాలయాల్లో కూర్చొని అంచనాల ఆధారంగా వివరాలు నమోదు చేయకుండా, కేటాయించిన ప్రతి ఇంటినీ ప్రత్యక్షంగా సందర్శించి వాస్తవ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. ప్రజలు అందించే వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో నమోదు చేయాలని, ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు.

తాగునీరు, పారిశుధ్య వివరాల నమోదులో వాస్తవికత అవసరం

జనాభా గణనలో తాగునీటి వసతి వివరాలను నమోదు చేసేటప్పుడు ప్రజలు వ్యక్తిగతంగా కొనుగోలు చేస్తున్న నీటి క్యాన్లను ప్రాతిపదికగా తీసుకోకుండా, సంబంధిత నివాసానికి ప్రభుత్వ నీటి సరఫరా వ్యవస్థ ద్వారా అందుబాటులో ఉన్న సదుపాయాలను వాస్తవికంగా నమోదు చేయాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ కింద సుమారు రూ.450 కోట్లతో డోన్ వాటర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేసి, 138 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు, కొండ ప్రాంతాల్లోని తండాలతో పాటు రెండు మున్సిపాలిటీలకు రక్షిత తాగునీరు అందించే ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు.

స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనలో భాగంగా గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ హోదా సాధించాలంటే కేవలం మరుగుదొడ్ల నిర్మాణమే కాకుండా, ద్రవ వ్యర్థాలు, ఘన వ్యర్థాలు, మల వ్యర్థాల సమర్థ నిర్వహణ కూడా తప్పనిసరి అని తెలిపారు. మరుగుదొడ్లు లేని కుటుంబాల వివరాలను ఎన్యూమరేటర్లు ఎలాంటి దాపరికం లేకుండా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి మరుగుదొడ్డి సదుపాయం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అలాగే సెప్టిక్ ట్యాంకుల నుంచి వెలువడే వ్యర్థాలు చెరువులు, ఇతర నీటి వనరుల్లో కలవకుండా శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలను కలుపుకుని జిల్లాలో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు మంజూరు లభించినట్లు వెల్లడించారు.

అక్షరాస్యత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు



కార్యక్రమాలను రూపొందించడం

సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, త్రైమాసిక జాబ్ మేళాల ద్వారా అర్హులైన యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ గణాంకాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు.

జనాభా గణన అనేది కేవలం జనాభా లెక్కింపు మాత్రమే కాదని, భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలకు దిశానిర్దేశం చేసే కీలక ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు జనాభా గణనపై ఉన్న సందేహాలను ఓపికగా నివృత్తి చేస్తూ, ప్రతి ఒక్కరి సహకారం తీసుకోవాలని, సేకరించిన సమాచారంలో ఖచ్చితత్వం, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు.

మహానంది దేవస్థానం నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామికి పట్టు వస్త్రాలు

మహానంది, పల్లె వెలుగు కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలో వెలసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారికి మహానంది దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. శనివారం ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఆనవాయితిలో భాగంగా పట్టు వస్త్రాలను తీసుకెళ్లారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి 418వ జయంతి సందర్భంగా జరిగే గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి శాంతి కళ్యాణ మహోత్సవానికి ఈ పట్టు వస్త్రాలను సమర్పించారు. పట్టు వస్త్రాలు తీసుకెళ్లిన అధికారులకు బ్రహ్మంగారి మఠం మేనేజర్ పిపిఎన్ ప్రసాద్, మఠాధిపతుల సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామి, మఠం అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మధు, ఆలయ పర్యవేక్షకులు, ధర్మకర్తలు, ఆలయ వేదపండితులు,అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.








కొత్తూరు సుబ్బరాయునిలో అన్నదానమునకు 50 వేలు విరాళం.

పల్లె వెలుగు పాణ్యం. ప్రముఖ శైవక్షేత్రం, పాణ్యం మండలం, ఎస్.కొత్తూరు గ్రామంలో



వెలసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానము నందు భక్తుల సౌకర్యార్థం నిర్వహించబడుతున్న అన్నదానమునకు శనివారం బండి నాగిరెడ్డి రూ. 50,116/-లు విరాళంగా సమర్పించారని ఆలయ ఈవో యం.రామకృష్ణ తెలిపారు. ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన కీ॥ శే॥ బండి గోపాల వెంకటస్వామి, సతీమణి కీ॥ శే॥ నారాయణమ్మ కుమారుడు కీ॥ శే॥ బండి వెంకటరమణ ల జ్ఞాపకార్థం ఆగస్టు 7వ తేదీన అన్నదానం నిర్వహించుట నిమిత్తం ఈ విరాళం సమర్పించబడినట్లు దాత బండి నాగిరెడ్డి తెలిపారు. వారిని ఆలయ మర్యాదలతో స్వామి వారి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి శేష వస్త్రములతో సత్కరించి ప్రసాదములు వితరణ చేశారు.

కొత్తూరు సుబ్బరాయుని సన్నిధిలో గౌరు, గంగుల నాని పూజలు.






పల్లె వెలుగు పాణ్యం. ప్రముఖ శైవ క్షేత్రం, పాణ్యం మండలం, క. కొత్తూరు గ్రామంలో వెలసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి సన్నిధిలో టీడీపీ నాయకుడు, నందికొట్కూరు ఇన్‌ఛార్జి గౌరు వెంకటరెడ్డి, ఆళ్లగడ్డ నియోజకవర్గం వైసీపీ నాయకుడు గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి (నాని) శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మంటపము నందు పూలమాలలతో, శేష వస్త్రములతో ఘనంగా సత్కరించి ప్రసాదము అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మిలటరీ సుబ్బారెడ్డి, అమరసింహారెడ్డి, ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ తిరస్కరించడంతో మాజీ ఎమ్మెల్యే కాటసాని ధర్నా

బనగానపల్లె, నవంబర్ 21, పల్లెవెలుగు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ గెలవలేక పోలీసులు ,ఎన్నికల అధికారులను అడ్డం బనగానపల్లె మేజర్ గ్రామపంచాయతీ వైసీపీ



మద్దతుతో నామినేషన్లు వేసిన సర్పంచ్, 20 వార్డు సభ్యుల నామినేషన్లను తిరస్కరించడంతో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుభాషిని బనగానపల్లె మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైసీపీ మద్దతుతో పోటీ చేసిన అబ్దుల్ పైజ్, 20 మంది వార్డు సభ్యుల నామినేషన్ సక్రమంగా లేవని తిరస్కరించారు. దీంతో ఎంపీడీవో కార్యాలయం ముందు రోడ్డుపై మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ,సర్పంచ్ అభ్యర్థి అబ్దుల్ పైజ్, వార్డు సభ్యులుగా పోటీ చేసిన అభ్యర్థులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు కలిసి రోడ్డుపై బైఠాయించి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ ఫైజ్ ను వైసిపి మద్దతుతో

బనగానపల్లె మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ గా పోటీ చేయించడంతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి భయపడి తన భార్య సర్పంచ్ గా ఓడిపోతుందని భయంతో నామినేషన్ తిరస్కరించారని విమర్శించారు. నామినేషన్లు అన్ని సక్రమంగా ఉన్నా ఎన్నికల అధికారిపై ఒత్తిడి తెచ్చి వైసీపీ మద్దతుతో పోటీ చేసిన సర్పంచ్ , 20 వార్డు సభ్యుల నామినేషన్లు తిరస్కరించినట్లు తెలిపారు. బనగానపల్లె మేజర్ గ్రామపంచాయతీలో బిసి ఓట్లు అధికంగా ఉన్నాయని ఈ సీటు బీసీలకు రిజర్వేషన్ కావాల్సి ఉందన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తన భార్యను సర్పంచ్ గా చేసుకునేందుకు జనరల్ కేటాయించారని విమర్శించారు. అప్పలాపురం గ్రామపంచాయతీ జనరల్ కు కేటాయించవలసి ఉందని, అక్కడ బీసీలకు రిజర్వేషన్ చేయించి బనగానపల్లెను జనరల్ కు కేటాయించారని విమర్శించారు. బనగానపల్లె ను అభివృద్ధి చేసి ఉంటే సర్పంచ్ ఎన్నికలకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు .ఓడిపోతామనే భయంతో ప్రజాస్వామ్యబద్ధంగా పెట్టుకొని వైసీపీ మద్దతు దారుల నామినేషన్లను తిరస్కరిస్తున్నారని విమర్శించారు. ఉదయం ఎనిమిది గంటలకు స్క్రూటీనీకి రమ్మని సాయంత్రం 6:30 గంటలకు నామినేషన్లు తిరస్కరించినట్లు తెలుపడం దారుణం అన్నారు. 2029 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కూటమి ప్రభుత్వానికి వత్తాసు పలికిన అధికారులు, పోలీసులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి, వైసీపీ నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి ,లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ ఖైర్, వైసీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.బనగానపల్లెలో ఉద్రిక్తత– బనగానపల్లె సర్పంచ్ వార్డు మెంబర్ల నామినేషన్లను తిరస్కరించారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడంతో పట్టణంలో ఉద్రిక్తత పరిస్థితి నెలపొంది నంద్యాలకు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి.

కొత్తూరు సుబ్బరాయుని సన్నిధిలో గౌరు, గంగుల నాని పూజలు.

పల్లె వెలుగు పాణ్యం. ప్రముఖ శైవ క్షేత్రం, పాణ్యం మండలం, క. కొత్తూరు గ్రామంలో వెలసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి సన్నిధిలో టీడీపీ నాయకుడు, నందికొట్కూరు ఇన్‌ఛార్జి గౌరు వెంకటరెడ్డి, ఆళ్లగడ్డ నియోజకవర్గం వైసీపీ నాయకుడు గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి (నాని) శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మంటపము నందు పూలమాలలతో, శేష వస్త్రములతో ఘనంగా సత్కరించి ప్రసాదము అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మిలటరీ సుబ్బారెడ్డి, అమరసింహారెడ్డి, ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com